క్లుప్తంగా

సత్యమ్మ ఆలయంలో అన్న సమారాధన

నందిగామ:మండల పరిధిలోని అంబారుపేట గ్రామంలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయంలో భారీ అన్న సమారాధన జరిగింది. అమ్మవారు శాకంబరీ దేవిగా కొలువుదీరిన నేపథ్యంలో అమ్మవారికి అలంకరించిన కూరగాయలు, ఆకు కూరలతో బుధవారం అన్న సంతర్పణ చేశారు. అంతకు ముందు అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఈవో పామర్తి సీతారామయ్య, పాలకవర్గ చైర్మన్ ఆలోకం శ్రీనివాసరావు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఉత్తమ రైతులకు సత్కారం



కంచికచర్ల :రైతు దినోత్సవం సందర్భంగా కేడీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో ఉత్తమ రైతులకు అవార్డులను బుధవారం అందించారు. కంచికచర్లకు చెందిన మండల శ్రీనివాసరావుకు ఉత్తమ రైతు అవార్డు దక్కింది. మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్‌బాబు, నాగిరెడ్డి, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్, తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధిలు ఉత్తమ రైతు అవార్డు అందజేయటంతో పాటు రూ. 10వేల నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కాలవ పెదబాబు, పాల్గొన్నారు.

పల్లంపల్లి(వీరులపాడు):మండలంలోని పల్లంపల్లి గ్రామానికి చెందిన నువ్వుల విశ్వనాథం ఉత్తమ రైతుగా ఎంపికవటం అభినందనీయమని ఎంపీపీ కోటేరు లక్ష్మీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు తెలిపారు. గ్రామంలోని ఆయన నివాసంలో బుధవారం విశ్వనాథంను సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమం, శ్రేయస్సే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. చారిత్రాత్మక పథకాలను ప్రవేశపెడుతూ రైతుకు అన్ని రకాలుగా అండగా ఉండి ఆదుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, అయిలూరి నర్సిరెడ్డి, గాంధీ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): దేశంలోనే పెద్ద ఎత్తున ముస్లిం మైనార్టీలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్.గౌస్‌మొహిద్దీన్ కోరారు. హర్ దిల్ మే వైఎస్సార్ కార్యక్రమంలో భాగంగా బుధవారం చిట్టినగర్‌లోని మోతీ మసీదు కమిటీ పెద్దలతో సమావేశమయ్యారు. షేక్.గౌస్‌మొహిద్దీన్ మసీదు పెద్దలు, కమిటీ సభ్యులతో మాట్లాడుతూ.. నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం మైనార్టీ వర్గాల కోసం పెద్ద ఎత్తున కృషి చేసిందన్నారు. దేశంలోనే సంక్షేమ పథకాలను అమలులో వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆదర్శవంతంగా పాలన సాగిస్తోందని చెప్పారు. మసీదు ఇమామ్, మౌసన్ జీతాల, ఇతర సమస్యలను నమోదు చేసుకున్నారు. అనంతరం సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 48వ డివిజన్ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, మైనార్టీ నాయకులు షేక్.బడేమియా, షేక్.యాసిన్, ఎండీ ఇక్బాల్, మసీదు కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ఖాజా, సెక్రటరీ షేక్.ఇసాక్ అలీ, హమీద్ బేగ్, చాన్‌బాషా పాల్గొన్నారు.

రేపు మాదిగల జన జాగృతి సభ



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 7వ తేదీ శుక్రవారం గాంధీనగర్ జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించే మాదిగల జన జాగృతి సభను జయప్రదం చేయాలని మాదిగల రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక సభ్యుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ మానికొండ శ్రీధర్ మాదిగ అధ్యక్షతన బుధవారం మాదిగల జన జాగృతి సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ.. మాదిగలు సంక్షేమానికి, అభివృద్ధికి రాజకీయ ప్రాధాన్యతకు నోచుకోలేక అన్ని రాజకీయ పార్టీల నిర్లక్ష్యానికి గురవుతున్నారన్నారు. వర్గీకరణతో పాటు మాదిగల సమగ్ర అభివృద్ధి విద్యా, ఉద్యోగ, రాజకీయ అవకాశాలను కల్పించే విధంగా మాదిగ జాతి ముందుకు వెళ్లే విధంగా మాదిగలను చైతన్యం చేస్తున్నామన్నారు. ఈనెల 7వ తేదీ జింఖానా గ్రౌండ్‌లో జరిగే మాదిగల జన జాగృతి సభ కు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్లు వైఎస్ రాజు మాదిగ, పానుగంటి సాలెం రాజు మాదిగ, బొడ్డు కిషోర్ మాదిగ తదితరులున్నారు.

జగనన్న సురక్షలో దీర్ఘకాల సమస్యలకు పరిష్కారం



చందర్లపాడు-3 జగనన్న సురక్ష క్యాంపులో సర్టిఫికెట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్(చందర్లపాడు):దీర్ఘకాల సమస్యలు సైతం జగనన్న సురక్ష క్యాంపుల్లో పరిష్కారమవుతున్నాయని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు తెలిపారు. చందర్లపాడు మండలంలోని ముప్పాళ్ల-2, చందర్లపాడు-3 గ్రామ సచివాలయాల పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ గతంలో చెప్పులరిగేలా తిరిగినా లభించని ధ్రువీకరణ పత్రాలు నేడు గంటల వ్యవధిలో చేతికందుతున్నాయని చెప్పారు. తమ సమస్య ఇంత తొందరగా పరిష్కారమవడం చూసి రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధిదారులు ఎనలేని సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన వల్ల రాష్ట్రంలోని లక్షల మంది ముఖాల్లో చిరునవ్వులు చూస్తున్నామని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికల సమయంలో తప్ప ప్రజా ప్రతినిధులు ప్రజలకు కనిపించే వారు కాదన్నారు. కానీ జగనన్న పాలనలో నిత్యం ప్రజలతో మమేమవుతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి అందిస్తున్న ప్రజా సంక్షేమ పాలనతో ప్రజల ముందుకు సగర్వంగా వెళ్తున్నామని పేర్కొన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజల ఇళ్ల ముందుకు వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించటం దేశ చరిత్రలో ఎన్నడూ.. ఎక్కడా చేసిన దాఖలాలు లేవన్నారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఎమ్మెల్యే జగన్‌మోహనరావు సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రవీంద్ర, తహసీల్దార్ సుశీలాదేవి, జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, సర్పంచులు గంగూరి బాబు, కస్తాల పున్నమ్మ, పీఏసీఎస్ చైర్మన్‌లు రాయల జానకిరామయ్య, నల్లాని అయ్యన్న, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, కోట సత్యం, పెద్దబ్బాయ్, నల్లాని శ్రీనివాసరావు, వేల్పుల ప్రసాద్, శ్రీనివాసరావు, బుగ్గినేని సురేష్, పలువురు అధికారులు, సచివాలయ ఉద్యోగులు, నాయకులు తదిరులు పాల్గొన్నారు.

క్లీన్ ఆంధ్రప్రదేశ్‌కు సీఎం కృషి

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



మున్సిపల్ కార్యాలయం వద్ద ఎలక్ట్రిక్ ఆటోలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్:రాష్ట్రాన్ని క్లీన్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలనే ధృడ సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా నందిగామ మున్సిపాలిటీలో చెత్త సేకరణకు ప్రభుత్వం మంజూరు చేసిన తొమ్మిది ఎలక్ట్రికల్ ఆటోలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ చిన్న మున్సిపాలిటీలకు సైతం చెత్త సేకరణకు పర్యావరణహితంగా ఉండే విద్యుత్ ఆటోలను ప్రవేశపెట్టారన్నారు. ఎలక్ట్రిక్ ఆటోల వల్ల మున్సిపాలిటీలకు నిర్వహణ భారం కూడా తగ్గుతుందని తెలిపారు. పారిశుద్ధ్య సౌకర్యాలను మరింత మెరుగు పరిచేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న స్వచ్ఛ సంకల్పానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఇప్పటికే ఇంటింటికీ తడిపొడి చెత్తను వేర్వేరుగా వేసేందుకు రంగు డబ్బాలను అందించటం జరిగిందన్నారు. ఇళ్లలోని చెత్త, వ్యర్థ పదార్థాలను రోడ్లను, వీధుల్లో పడేయకుండా ఇళ్ల ముందుకు మున్సిపాలిటీ సిబ్బంది వచ్చినప్పుడు రంగు డబ్బాలలోని తడిపొడి చెత్తను అందించాలని సూచించారు. మన ఇళ్లతో పాటు ఇంటి పరిసరాలు, వీధులను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. చెత్త సేకరణకు ప్రభుత్వం అందించిన ఎలక్ట్రిక్ ఆటోలను సక్రమంగా వినియోగించేలా చూడాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, మున్సిపల్ కమీషనర్ జయరాం, ఏఈ ఫణి శ్రీనివాసరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, నాయకులు గుడివాడ సాంబశివరావు, చిరుమామిళ్ల చైతన్యకుమార్, పాకాలపాటి కిరణ్, తానూరి రాము, షేక్ ఖాలిక్, మారం అమరయ్య, యాకుబ్ అలీ, బాపట్ల సాంబయ్య, బండారు శేషు, మందా మరియమ్మ, కర్రి రవీంద్ర, మన్నెం దాసు, షేక్ జాఫర్, పిల్లి జయరాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు సురక్ష క్యాంపులు

జగ్గయ్యపేట అర్బన్:జగనన్న సురక్ష కార్యక్రమం పట్టణంలో గురువారం రెండు సచివాలయాల్లో జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు 11 వ సచివాలయం (23, 24 వార్డులు)కు సంబంధించి ఉదయం 10 గంటలకు 3 వ సచివాలయం (3, 4 వార్డులు)కు సంబంధించి వెంకటగిరి గుట్ట పుట్ట రోడ్‌లో జరిగే జగనన్న సురక్ష క్యాంపులో ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొంటారని తెలిపారు. ఎలాంటి ఫీజులు వసూలు చేయకుండానే అర్హులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందిస్తారని చెప్పారు.

చిల్లకల్లు(జగ్గయ్యపేట):మండలంలోని అన్నవరం, గండ్రాయి-2 సచివాలయాల్లో గురువారం జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ బుధవారం తెలిపారు. అన్నవరంలో తహసీల్దార్, పీఆర్ ఏఈ గండ్రాయి-2లో ఈవోపీఆర్డీ, డీటీల ఆధ్వర్యంలో క్యాంపులు జరుగుతాయన్నారు. ప్రజలు క్యాంపులను వినియోగించుకోవాలని కోరారు.

నందిగామ: పట్టణ పరిధిలోని 3 వ సచివాలయం వద్ద గురువారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా మండలంలోని కొండూరు, చందాపురం గ్రామాల్లోని సచివాలయాల వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాలు జరుగుతాయని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

9న కన్యాకాపరమేశ్వరి అమ్మవారికి ఆషాఢ సారె

జగ్గయ్యపేట అర్బన్:ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ఆశాఢ సారె, శాకంబరి కార్యక్రమం నిర్వహిస్తున్నామని దేవస్థానం కమిటీ ప్రతినిధులు బుధవారం తెలిపారు. ఉదయం పలు రకాల కూరగాయలతో విశేషంగా శాకంబరి అలంకరణ, సాయంత్రం అమ్మవారికి సారె, ఊరేగింపు, మహిళలచే అఖండ సౌభాగ్య కుంకుమార్చన, లలిత సహస్రనామ పారాయణం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమాలన్నీ వాసవి క్లబ్ ఆనందవనం, వాసవి క్లబ్ వనిత ఆధ్వర్యంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఇన్‌కంటాక్స్ రిటర్న్ దాఖలు చేయాలి

విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు రామ్మోహన్‌రావు



కార్యాలయంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

కంచికచర్ల: ప్రభుత్వ పెన్షనర్లు ఈ నెలాఖరులోగా ఇన్‌కంటాక్స్ రిటర్న్‌లు దాఖలు చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహన్‌రావు అన్నారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో బుధవారం కంచికచర్ల, వీరులపాడు మండలాల్లోని విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ మేరకు సానె మాట్లాడుతూ రూ. 3 లక్షలు ఆదాయం దాటిన పెన్షనర్లు ఇన్‌కంటాక్స్ రిటర్న్ చేయాలని సూచించారు. ఆదాయం రూ.5లక్షలు వరకు ఇన్‌కం టాక్స్ పడనప్పటికీ సెక్షన్ 87 ఏ వల్ల టాక్స్ రిబేట్ పొందినట్లు రిటర్న్ దాఖలు చేయాలని తెలిపారు. పెన్షనర్లు అద్దె ఇంట్లో ఉన్నప్పటికీ రూ.5వేలు చొప్పున ఏడాదికి రూ. 60వేలు టాక్స్ మినహాయింపు పొందవచ్చని పేర్కొన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి పెన్షన్ ఆదాయ వివరాలను ఉప ఖజానా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో సంఘ కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ పెద్దినీడి కోటేశ్వరరావు, కోశాధికారి సీహెచ్ నాగేశ్వరరావు, సీహెచ్ స్వర్ణలత, బీవీ సర్వేశ్వరరావు, బి.కృష్ణమూర్తి జానిమియా, మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

కౌలు వేలం ద్వారా రూ. 1.25 లక్షల ఆదాయం

వేదాద్రి(జగ్గయ్యపేట):గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయానికి చెందిన భూముల కౌలు వేలం ద్వారా రూ. 1.25 లక్షల ఆదాయం వచ్చిందని ఈవో హేమలతా దేవి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం గ్రామంలోని ఆలయానికి చెందిన 43.14 ఎకరాలకు కౌలు వేలం పాటలు నిర్వహించారు. ఈ పాటల ద్వారా పై ఆదాయం వచ్చిందన్నారు. ఏడాది పాటు పాటలు అమలులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్ జయప్రకాష్ బాబు, రైతులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు



దాములూరు గ్రామంలోని ఎరువుల దుకాణంలో విత్తనాల ప్యాకెట్లను పరిశీలిస్తున్న అధికారులు



పెనుగంచిప్రోలు మండలంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ, పక్కన ఏఓ తదితరులు

నందిగామ: మండలంలోని దాములూరు గ్రామంలో గల ఎరువుల దుకాణంలో బుధవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విత్తన విక్రయ లైసెన్స్ లేకుండానే షాపు యజమాని ఎరువుల దుకాణంలో రైతులకు విక్రయించేందుకు పత్తి విత్తనాలను నిల్వ ఉంచాడు. ఈ నేపథ్యంలో దుకాణంలో ఉంచిన రూ . 25,500 విలువచేసే 30 పత్తి విత్తనాల ప్యాకెట్లను అధికారులు గుర్తించారు. వాటిని సీజ్ చేయడంతోపాటు దుకాణ యజమానిపై విత్తన చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ సీఐ జి.వసంత బాబు తెలిపారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ ఏడీఏ కళ్యాణ్ కుమార్, ఏవో ఖాసిం పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

పెనుగంచిప్రోలు:రైతులకు నాణ్యమైన విత్తనాలు నిర్దేశించిన ధరలకే విక్రయించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ ఐకె శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని పలు విత్తన దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. షాపుల్లోని రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి, మిర్చి విత్తనాలకు కృత్రిమ కొరత సృష్టించటం, అధిక ధరలు, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తన నిల్వలను స్టాక్ బోర్డుపై తప్పనిసరిగా రాయాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ కె. రామసుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా రంగంలోని సమస్యలను పరిష్కరించాలి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు):ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంతో పాటుగా డీఎస్సీ నిర్వహించాలని, జీవో నంబరు-01ను పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకులు జమ్మిచెట్టు సెంటర్‌లోని బోయపాటి శివరామకృష్ణయ్య మున్సిపల్ స్కూల్ ఎదుట బుధవారం ఆందోళన చేశారు. ఏబీవీపీ ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ వెంకటగోపి మాట్లాడుతూ టెక్నో, ఒలంపియాడ్, ఇంటర్నేషనల్ స్కూల్ వంటి బ్రాండ్‌ల పేర్లు తగిలించుకుని కార్పొరేట్ విద్యావ్యాపారం జోరుగా జరుగుతోందన్నారు. పాఠశాల పేరు వెనుక ఇలాంటి బ్రాండ్‌లను పెట్టి తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని చెప్పారు. బుక్స్, యూనిఫామ్, బ్యాగ్స్ పేరుతో పాఠశాల యాజమాన్యాలు దుకాణాలు తెరిచాయని వెంకట గోపి అన్నారు. 2009 విద్యాహక్కు చట్టాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. ఏబీవీపీ సభ్యులు దుర్గారావు, అఖిల్, సీహెచ్.వంశీ, నాగరాజు పాల్గొన్నారు.

షేడ్‌నెట్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి



శివాపురం నర్సరీ నిర్వాహకులతో మాట్లాడుతున్న దృశ్యం



షేడ్‌నెట్‌ను పరిశీలిస్తున్న డీహెచ్‌వో బాలాజీకుమార్

పెనుగంచిప్రోలు:షేడ్‌నెట్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలని ఉద్యానవనశాఖ జిల్లా అధికారి బాలాజీరావు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన షేడ్‌నెట్ నర్సరీలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీ దారులు నాణ్యమైన విత్తనాలు విత్తుకోవాలన్నారు. రైతులకు నాణ్యమైన నారు అందించాలని సూచించారు. ప్రభుత్వం రూపొందించిన నియమ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఉద్యానవనశాఖాధికారి వర్ధిని, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు బిల్లులు అందించాలి

వత్సవాయి :షేడ్‌నెట్లలో మిర్చినారు కొనుగోలు చేసిన రైతులకు విధిగా బిల్లులు అందించాలని డివిజన్ ఉద్యానవన శాఖాధికారి బి. బాలాజీకుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని షేడ్‌నెట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం మిర్చినారును సాగుచేయాలని తెలిపారు. ఏ కంపెనీ విత్తనాలు నాటుతుందో తెలిసే విధంగా బోర్డులు ఉంచాలన్నారు. నెట్ లోపల పిచ్చిమొక్కలు లేకుండా శుభ్రంగా ఉంచాలని చెప్పారు. వైరస్‌లు దరిచేరకుండా చుట్టూ బంతిమొక్కలు నాటుకోవాలని సూచించారు. నాసిరకం విత్తనాలు నాటినట్లు తేలితే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఉద్యానవనశాఖాధికారిణి టి వర్ధినీకుమారి తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవన ప్రమాణాలు పెంచేలా పాలన

గడప గడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



కొణతాలపల్లి గ్రామంలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కొణతాలపల్లి(వీరులపాడు):ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన అందించటంతో పాటు నిరుపేదల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మండలంలోని కొణతాలపల్లి గ్రామంలో బుధవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించటంతో పాటు ప్రజా సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జగన్ మోహనరావు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని చెప్పారు. పథకాల అమల్లో పక్షపాత వైఖరి చూపకుండా అన్ని వర్గాలకు అర్హతే ప్రామాణికంగా అందిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉంటే పాలన ఎలా ఉంటుందో రాష్ట్ర ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారన్నారు. ఎన్నికలు, ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసి అనతి కాలంలోనే మంచి ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించి వారు ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారని చెప్పారు.

ప్రజలకు మంచి చేయాలనే తపన...

ప్రజలకు నిరంతరం మంచి చేయాలనే తపనతో పని చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలిచి పూర్తి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నువ్వుల విశ్వనాథం, సర్పంచ్ నంద్రు సౌజన్య, ఎంపీటీసీ సభ్యురాలు అయిలూరి వెంకట్రావమ్మ, ఉప సర్పంచ్ అయిలూరి నర్సిరెడ్డి, నాయకులు నరాల రాజేశ్వర్ రెడ్డి, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

బల్లకట్టు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు



ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన లైఫ్ జాకెట్‌లను పరిశీలిస్తున్న సీఐ

నందిగామ(చందర్లపాడు):బల్లకట్టు నిర్వాహకులు నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని నందిగామ రూరల్ సీఐ నాగేంద్ర కుమార్ హెచ్చరించారు. చందర్లపాడు మండలం గుడిమెట్ల సమీపంలోని కృష్ణా నదిలో తిరిగే బల్లకట్టు నిర్వాహకులు నిబంధనలు పాటించటం లేదని, దీనివల్ల ప్రయాణికులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో బుధవారం సాయంత్రం పోలీసులు బల్లకట్టును పరిశీలించారు. బల్లకట్టులో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన లైఫ్ జాకెట్ లను పరిశీలించడంతో పాటు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బల్లకట్టులోని ప్రయాణికులందరూ తప్పనిసరిగా లైఫ్ జాకెట్ ధరించే విధంగా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులదే నన్నారు. ముఖ్యంగా ప్రయాణికుల వద్ద వసూళ్లు చేసే చార్జీల వివరాలకు సంబంధించిన ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా రాత్రి సమయాల్లో బల్లకట్టును తిప్పితే సహించబోమన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే బల్లకట్టుని నడుపుకోవాలని ఆ యన స్పష్టం చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంట చందర్లపాడు ఎస్ఐ రామకృష్ణ, పలువురు సిబ్బంది ఉన్నారు.

రూ.లక్ష రాయితీతో రైతులకు ట్రాక్టర్లు



ట్రాక్టర్ కంపెనీ ప్రతినిధులతో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: రైతులకు రూ. లక్ష రాయితీతో ట్రాక్టర్లు అందిస్తున్నామని డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఐషర్ ట్రాక్టర్ కంపెనీ ప్రతినిధులు బుధవారం ఎమ్మెల్యే జగన్‌మోహనరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా కంపెనీ ప్రతినిధులు ఎమ్మెల్యేతో కొద్దిసేపు చర్చించారు. తక్కువ ధరకు రైతులకు ట్రాక్టర్‌లు అందించేందుకు ముందుకు వచ్చిన కంపెనీ ప్రతినిధులను ఎమ్మెల్యే అభినందించారు. కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ నాణ్యమైన, అత్యంత మైలేజీ, ధృడమైన ఐషర్ కంపెనీకి చెందిన 380 సెంటర్ గేర్, 480 సెంటర్ గేర్, 551 సెంటర్ గేర్ ట్రాక్టర్‌లను ఎమ్మెల్యే కోరిక మీద రూ. లక్ష రాయితీతో అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ట్రాక్టర్ కంపెనీ ప్రతినిధులు ఎమ్మెల్యే జగన్‌మోహనరావును సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, చింతా రవీంద్ర, బుడ్డి సత్యం, రాయల జానకిరామయ్య, మారత శ్రీను, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఇళ్లపై 33 కేవీ విద్యుత్ వైర్లు తొలగింపు



కంచికచర్లలో 33 కేవీ విద్యుత్ వైర్లను తొలగిస్తున్న దృశ్యం

కంచికచర్ల: పలు కాలనీ ఇళ్లపై వేలాడుతున్న 33 కేవీ విద్యుత్ వైర్లను బుధవారం ఆ శాఖ అధికారులు తొలగించే పనులు చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా విద్యుత్ హైటెన్షన్ వైర్లతో పలు కాలనీ వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో 33 కేవీ హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఇళ్లపై వేలాడటంతో అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. మరి కొంతమంది గాయాల పాలయ్యారు. ఈ విషయాన్ని పట్టణ సీనియర్ నాయకులు వేమా సురేష్‌బాబు, నన్నపనేని నరసింహారావు, కాలవ పెదబాబు, కాలవ వాసుదేవరావులు ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారిద్దరు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే 33 కేవీ హైటెన్షన్ వైర్లు తొలగించాలని రూ.1కోటి నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో విద్యుత్‌శాఖ అధికారులు ఇళ్లపై వేలాడుతున్న 33కేవీ హై టెన్షన్ విద్యుత్ వైర్లను తొలగించేందుకు తక్షణ చర్యలు చేపట్టారు. దీంతో పట్టణంలోని వసంతకాలనీ, ఇందిరాకాలనీ, మోడల్‌కాలనీ, ప్రణీత కాలనీ, జుజ్జూరురోడ్డులో నివసించే ప్రజలు సీఎంకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు, మాజీ ఎంపీటీసీ సభ్యులు శేషం వాసుబాబు, గ్రంధి ఆదిత్య, విద్యుత్‌శాఖ ఏఈ కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సర్వే పరిశీలన



పరిటాలలో జగనన్న సురక్ష సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాలశంకరరావు

పరిటాల(కంచికచర్ల): మండలంలోని పరిటాలలో నిర్వహించిన జగనన్న సురక్ష సర్వేను బుధవారం ఎంపీడీఓ కె.బాలశంకరరావు పరిశీలించారు. ఈ మేరకు ఎంపీడీఓ మాట్లాడుతూ, వలంటీర్లు, గృహ సారథులు ప్రతి గడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.